



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	25	28
భద్రాద్రి	18	28



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..

- జీవితాశయాన్ని ఎంచుకొని పట్టుదలతో కృషి చేయాలి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- వి వెంకటాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులతో మాటామంతీ

వివరాలు : 6లో



కొమ్ము తలపాగ ధరించి డోలు వాయిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజన మ్యూజియంకు పునర్వైభవం

- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ముందుతరాలకు తెలియాలి
- ఆచార వ్యవహారాలు, సంస్కృతి పరిరక్షణకు నిరంతర కృషి
- భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్

వివరాలు : 7లో



వైద్య ఉద్యోగులతో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్

సెల్‌ఫోన్‌తో టైంపాస్ చేయొద్దు

- రోగులను పట్టించుకోకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- ఇల్లెందు వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ.. సిబ్బందికి క్లాస్...

వివరాలు : 7లో



జిల్లా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్

- భవన నిర్మాణానికి రూ.23.75 కోట్ల నిధులు మంజూరు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 24: జిల్లా జనరల్ ఆస్పత్రిలో రూ 23. 75 కోట్లతో క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు టీఎస్ఎంఐడీసీ ఆధ్వర్యంలో ఈ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో పాత భవనంలో ప్రస్తుతం క్యాజువాలిటీ, ఇతర అత్యవసర విభాగాలకు సంబంధించిన సేవలు అందిస్తున్నారు. అయితే ఈ భవనం పూర్తిగా శిథిలం కావడంతో ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ భవనాన్ని ప్రభుత్వం మంజూరి చేసింది. వీటితో ప్రస్తుతం ట్రామా కేర్ ఎదురుగా ఈసీహెచ్‌ఎస్ (రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సేవా ఆస్పత్రి) శిథిలావస్థకు చేరుకుంది. దాన్ని కూల్చి వేసి ఆ ప్రాంతంలో క్రిటికల్ కేర్ భవనాన్ని నిర్మించాడానికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన డిజైన్‌ను ప్లాన్ కూడా అధికారులు సిద్ధం చేశారు. జీప్లస్ మూడు అంతస్థులతో దీన్ని నిర్మించనున్నారు. ఇది పూర్తయితే 50 పడకలతో అత్యవసర సేవలైన క్యాజువాలిటీ, ఐసీయూ, ఏఎంసీ, ఏపీ రూమ్స్ సీఎంఓ రూంలు ఇలా అన్ని విభాగాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. త్వరలో రాష్ట్ర మంత్రులతో ఈ భవానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎంఈ అధికారులు తెలిపారు.



అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త కళ


- పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ఏర్పాట్లు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 24: అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త కళ రానుంది. ఈ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదట ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నారు. ఆ తర్వాత జిల్లాలోని మొత్తం 1840 అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చనున్నారు. ప్రస్తుతం మండలానికి రెండు చొప్పున అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి రంగులు వేసి పూర్వ పాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేస్తున్నారు. వీటిని త్వరలోనే ప్రారంభించనున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేసి పిల్లలకు ఎలాంటి ఒత్తిడి లేని విద్యను, ఆట పాటలను నేర్పించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గతంలోలా కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రాలుగా కాకా ప్రీ స్కూల్ కేంద్రాలుగా గుర్తించనున్నారు. ప్రస్తుతం ఉన్న టీచర్‌కు అదనంగా మరో టీచర్‌ను ఏర్పాటు చేసి విద్యను అందించనున్నారు.

గోదావరి తగ్గుముఖం

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

6



వరాలు కురిపించేనా ?!

రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ఆశలు

- నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు నిధులు అత్యవసరం
- ఎమ్మెల్యేల హామీలకు మోక్షం కలిగేనా?
- ఐటీడీఏ ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకునేనా?
- రామాలయం మాస్టర్‌ప్లాన్ అమలుకు అడుగులు పడేనా?

రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం రాష్ట్ర అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఖమ్మం జిల్లా మధిర నుంచి భట్టి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తుండటంతో ఆయనపై ఉమ్మడి జిల్లావాసులు అనేక ఆశలు పెట్టు కున్నారు. నీటి పారుదల, విద్య, వైద్య రంగాలకు సంబంధించి ఆయన జిల్లాకు ఏ స్థాయిలో కేటాయింపులు జరుపనున్నారనేది ఆసక్తిగా మారింది. అలాగే భద్రాద్రి రామాలయ అభివృద్ధి, ఏజెన్సీ వాసులకు సంబంధించిన సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సి ఉంది. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు, ఇతర మునిసిపాలిటీల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరపాల్సి వుంది. మొత్తమ్మీద భట్టి తన సొంత జిల్లాకు ఏం ఒనగూరుస్తారో చూడాలి!

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/భద్రాచలం, జూలై 24 ఖమ్మం జిల్లా మధిర నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లు భట్టి విక్రమార్క.. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర అసెంబ్లీలో గురువారం మొదటిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన భట్టి.. ఇప్పుడు మొదటి సారి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండడంతో ఉమ్మడి జిల్లాకు ఆయన ఏ మేరకు నిధుల కేటాయింపులు జరుప బోతున్నారనేది ఆసక్తిగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యేలు ఎన్నో హామీలు ఇచ్చారు. జిల్లాలో అనేక నిర్మాణాలు, అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధుల కేటాయింపులు జరగాల్సి ఉంది.

సీతారామ ఎత్తిపోతలతోపాటు పాలేరు వైరా, లంకాసాగర్, బేతుపల్లి, తాలిపేరు, ప్రాజెక్టుల ఆధునీకరణ పనులకు నిధులు మంజూరుకావాల్సి ఉంది. అలాగే సాగర్ కాలవల ఆధునీకరణకు నిధుల కేటాయింపు జరిగితేనే మరమ్మతులు పూర్తికానున్నాయి. ఒక్క సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి పాలేరు లిక్‌కెనాల్ పనులకు మరో రూ.7500 కోట్ల నిధుల అవసరం ఉంది. ఖమ్మం నియోజకవర్గంలో కొత్తమెడికల్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.100 కోట్లు, ఖమ్మం మార్కెట్ ఆధునీకరణకు రూ.100 కోట్లు, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులకు రూ.100 కోట్ల అవసరం ఉంది.

అలాగే పాలేరు నియోజకవర్గంలో సీతారామ లింక్‌కెనాల్‌తో పాటు మద్దులపల్లి జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణాలకు రూ.500 కోట్ల నిధులు అవసరం ఉండగా ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించాలని జేఎన్‌టీయూ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. అలాగే మధిర నియోజకవర్గంలో కూడా జాలిముడి ప్రాజెక్టు ఆధునీకరణ, సాగర్ కాలవలకు మరమ్మతులు, ఇండస్ట్రీయల్ ఏర్పాటుకు నిధుల అవసరం ఉంది. అలాగే కొత్తగూడెంలో కూడా మెడికల్ కాలేజీ భవనాలకు నిధుల అవసరం ఉంది. జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం రూ.100 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయింపులు జరపాల్సిన అవసరం ఉంది.

భద్రాచలం,జమలాపురం పుణ్యక్షేత్రాల అభివృద్ధి, పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయిస్తేనే కొంత పర్యాటకంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉంది. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, ఇల్లెందు, మునిసిపాలిటీలకు నిధులు కేటాయింపు జరపాల్సిన అవసరం ఉంది. జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ, పీఆర్, మునిసిపల్ రోడ్లతో పాటు విద్యా, వైద్య అవసరాల నిమిత్తం కూడా నిధులు కేటాయింపు జరగాల్సి ఉంది.

ఏజెన్సీ వాసుల ఆశలు

భద్రాచలం ఐటీడీఏ పూనర్వైభవం సాధించేనా.. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామాలయం అభివృద్ధి దిశగా అడుగులు పడేనా అని ఏజెన్సీ వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీలో గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తరుణంలో ఐటీడీఏ ఆర్థిక పరిపుష్టికి నిధులు కేటాయిస్తారని ఏజెన్సీ వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వం రెండు దఫాల్లో భద్రాద్రి ఆలయ అభివృద్ధి రూ 150కోట్లు బడ్జెట్‌లో కేటాయింపుల్లో చేసినా దశాబ్ది కాలంలో నిధుల మంజూరి చేసిన దాఖలాలు లేవని విమర్శలు ఉన్నాయి.

భద్రాచలం ఐటీడీఏకు అధికంగా నిధులు కేటాయించాలని గిరిజనులు ఆశగా ఎదురుచూస్తున్న క్రమంలో ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు ఏ మేరకు చేస్తుంది అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే గతంలో ఐటీడీఏలు సింగ్ లైన్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రాజెక్టు అధికారి పర్యవేక్షణలో సాగేది. ఈ క్రమంలో పీవోలకు ఏజెన్సీలో అత్యవసర పనులు, పథకాలు ఇతరత్రా వాటికి కోసం సత్వరమే నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉండేది. కాని ఇటీవలి కాలంలో ఈ పథకాలు అన్ని ట్రైకార్ పరిధిలోకి వెళ్లడంతో పీవోలకు పూర్తిస్థాయి నిధులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయిందని గిరిజన సంఘాలు వాపోతున్నాయి.

గతంలో భద్రాద్రి ఏరియా వైద్యశాలలో రోగులకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం హైదరబాద్‌కు కేసును రిఫర్ చేస్తే డీజిల్ ఖర్చులను ఐటీడీఏ భరించేది. కాని నేడు పూర్తి స్థాయిలో ఆ పరిస్థితి అమలు కావడం లేదనే విమర్శలు ఆదివాసీ సంఘాల నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. ఐటీడీఏ పరిధిలోని సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హస్టల్స్ పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు కూడా క్రమం తప్పకుండా ఇచ్చే పరిస్థితి లేకపోవడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి గిరిజన ఉపప్రణాళిక ప్రాంతాల్లో గిరిజన జానాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 8 శాతం కేటాయించాలనే నిబంధన ఉన్నా అది పూర్తిస్థాయిలో అమలు కాని పరిస్థితి నెలకొంది.

రామభక్తుల ఆశలు

భద్రాద్రి రామాలయ అభివృద్ధి ఈ సారైనా ఆచరణకు నోచుకుంటుందా అనే ఆశ రామభక్తుల్లో ఉంది. ఎందుకంటే గత దశాబ్ద కాలంగా రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 150 కేటాయింపులే తప్పించి ఆచరణలో ఏ మాత్రం నిధులు మంజూరి చేయకపోవడం పట్ల విమర్శలు వచ్చాయి. కాగా ఇటీవల భద్రాద్రికి వచ్చిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, రామాలయ అభివృద్ధికి అంకిత భావంతో కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. దీంతో ఆలయ అభివృద్ధి ఇకనైనా సుసాధ్యం అవుతుందని అందరూ బావిస్తున్నారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధికారులు ఉండగా అభివృద్ధి వేగవంతంగా సాగాలంటే బడ్జెట్‌లో కేటాయింపులు ఎంతో అవసరమని భద్రాద్రి వాసులు భావిస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ఎంతో భవిష్యత్తు

- భద్రాద్రి జిల్లా స్ఫూర్తితో ఇతర జిల్లాల్లో విస్తరణ
- ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి
- పామాయిల్ ఫ్యాక్టరీల సందర్శన

అశ్వారావుపేట, జూలై 24: రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పామాయిల్ సాగును రికార్డు స్థాయిలో చేయడం ద్వారా హబ్‌గా మారిందని ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రశంసించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట, దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించారు. ఆయా ఫ్యాక్టరీలు పనిచేసే విధానం, క్రష్షింగ్, ఆయిల్ రికవరీ, ఫ్యాక్టరీల కండీషన్, ఉప ఉత్పత్తులు, ఇతర సాంకేతిక వివరాలను ఆయిల్‌ఫెడ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా ఆయిల్‌పామ్ సాగు అనుభవాలతో వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ జరగాల్సి ఉందని అన్నారు.

ఆయిల్‌పామ్ తూకం వేసే వే బ్రిడ్జి వద్ద, ఆన్‌లైన్ బిల్లు ప్రాసెస్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మోసాలకు తావులేకుండా చూడాలని కోరారు. దేశానికి ఏడాది కోటి టన్నుల పామాయిల్ అవసరం వుందని, కానీ మూడు లక్షల టన్నులే అందుబాటులో వుందని మిగతాది మలేషియా, ఇండోనేషియా వంటి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు రాఘవరెడ్డి తెలిపారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి వారి సందేహాలు తీర్చాలని సూచించారు. తెలంగాణలోని భూములు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతులు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

అనంతరం నారావారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయం, నర్సరీలను సందర్శించారు. విత్తనం, మొక్కల పెంపకం, మొక్కలు ఏ మేరకు సిద్ధంగా ఉన్నాయి. రాయితీలు వస్తున్నాయా? ఈ ఏడాది ఎన్ని ఎకరాల్లో మొక్కలు వేశారనే విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ పి.సుధాకరరెడ్డి, డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు శ్రీకాంత్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన రాఘవరెడ్డి



ఏజెన్సీలో ప్రసవ వేదన

- భద్రాద్రి ప్రభుత్వ వైద్యశాలలో ప్రసూతి వైద్యుల కరువు
- ఏడాదిన్నర కాలంగా ఇదే పరిస్థితి
- రేడియాలజిస్టు లేక నిరుపయోగంగా స్కానింగ్ విభాగం
- గర్భిణీలను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నవైనం
- వైద్యుల కొరతతో స్వయంగా సిజేరియన్ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం

భద్రాచలం, జూలై 24: చుట్టూ ఏజెన్సీ ప్రాంతాలు, నాలుగు రాష్ట్రాల కూడలిలో వైద్యసేవలందిస్తున్న భద్రాచలం ఏరియా వైద్యశాలలో ఒక్క ప్రసూతి వైద్యురాలు లేకపోవడం గమనార్హం.. ఇలా ఒక నెల, రెండు నెలలు కాదు ఏకంగా ఏడాదిన్నర కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ప్రసవం కోసం ఈ వైద్యశాలకు వచ్చిన ఓ గర్భిణికి ఇబ్బంది కర పరిస్థితి తలెత్తడంతో ఆసుపత్రిలో సర్జన్ లేడనే విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావే స్వయంగా వచ్చి సిజేరియన్ నిర్వహించి కాన్పు నిర్వహించారు. ఒక వేళ ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోతే ఆమె పరిస్థితి సంక్లిష్టంగా మారి ఉండేది. అదృష్టవశాత్తు ఎమ్మెల్యే సర్జన్ అయి ఉండడంతో ఆయన చొరవ తీసుకొని ఆపరేషన్ చేయడంతో తల్లీ, బిడ్డ క్షేమంగా బయటపడ్డారు.

ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి

భద్రాద్రి వైద్యశాలలో ఏడాదిన్నర కాలంగా రెగ్యులర్ ప్రసూతి వైద్యులే లేరు. (మిగతా 6వ పేజీలో)

ప్రతీ బుధవారం పాఠశాలల్లో
మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలి

» ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 24: ప్రతీ బుధవారం జిల్లా అధికారులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డన తీరును పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. దీంతో అధికారులు మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరును బుధవారం స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ఏన్కూరు ఉన్నత పాఠశాలను, డీఈవో సోమశేఖర్ శర్మ కొణిజర్ల ఉన్నత పాఠశాలను సందర్శించారు. వంట దినుసుల నాణ్యతను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓటఓ డాక్టర్ మాలతి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. నాగేందర్ రెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ ఎస్. సత్యనారాయణ, డీపీవో హరికిషన్, డీసీహెచ్ఎస్ రాజేష్, బీసీడీవో జ్యోతి, డీఐసీ జీఎం అజయ్ కుమార్, ఉపాధి అధికారి మాధవి వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరును స్వయంగా పరిశీలించారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా
నిర్మాణ అనుమతులు

» ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, జూలై24: టీఎస్ బీపాస్ విధానం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ అనుమతులు ఆమోదిస్తామని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి లేఅవుట్ అప్రూవల్ కమిటీ సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో 3, సత్తుపల్లి మునిసిపాలిటీలో 1, సుడా పరిధిలో 17, ఫైనల్ లేవట్లు ఆమోదం కోసం మొత్తం 21 దరఖాస్తులు పరిశీలించామన్నారు. నిబంధనల మేరకు సమర్పించిన దరఖాస్తులను కమిటీ ఆమోదించిందని తెలిపారు. లేఅవుట్లు అనుమతులను నిర్ణీత గడువులోగా నిబంధన మేరకు పూర్తిచేయాలన్నారు. 21రోజుల లోపు అనుమతులను జారీచేయాలని తెలిపారు గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకని మొక్కలు నాటాలన్నారు. ఈసమావేశంలో ఎస్డీసీ రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో రాజేందర్, ఇరిగేషన్ ఈఈ అనన్య, డీసీపీ వికాస్, టీపీవోసాయిరాం, పాల్గొన్నారు.

'సీతారామ'కు పూర్తిస్థాయిలో
నిధులు కేటాయించాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 24: ఖమ్మం జిల్లాలో 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు గురువారం పెట్టబోయే బడ్జెట్లో నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా ఖమ్మం జిల్లాకు చెందిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు మంచి అవకాశం దక్కిందన్నారు. రాజకీయ కారణాలతో అనేక ఏళ్లుగా జిల్లాపై వివక్ష కొనసాగిందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని నిధులు కేటాయింపులో జిల్లాకు న్యాయం చేయాలని కోరారు.

సాగు రంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

» రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో వ్యవసాయరంగాన్ని విస్మరించిందని ఎంతో కీలకమైన వ్యవసాయరంగానికి ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వలేదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 60శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగానికి కేవలం రూ.1.52లక్షల కోట్లు కేటాయించారని ఆరోపించారు. ఉత్పత్తిలో 15శాతం వ్యవసాయరంగం నుంచే జరుగుతుందన్నారు. కార్పొరేట్ ఉత్పత్తులకు ప్రాధాన్యం కల్పించి కార్పొరేట్శక్తులకు అనుకూలంగా బడ్జెట్ ఉందన్నారు.

చినుకుల్లో.. పంటల రక్షణ

ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల సూచనలు ● అధిక వర్షాల కారణంగా రైతుకు అపార నష్టం


పంటచేలను సందర్శించి సూచనలు చేస్తున్న ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

మధిర, జూలై 24: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వార్షాలకు వానాకాలం సీజన్లో సాగైన వివిధ రకాల పంటల్లో వరద నీరు నిలిచి పంటకు నష్టం వాటిల్లింది. కొన్ని పంటలు రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈతరుణంలో మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. కె రుక్మిణీదేవి మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా రైతుకు అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని దాన్ని అధిగమించడానికి నివారణ చర్యలు పాటించి నష్టం తగ్గించుకోవచ్చని తెలిపారు. రుక్మిణీదేవి ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డా. బీ భరత్ తదితరులుతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అధిక వర్షాలకారణంగా వివిధ పంటల స్థితిగతులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు వివిధ పంటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రైతులను వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న అధికవర్షాల వల్ల వివిధ రకాల పంటలైన వరి, కంది, పత్తి, మినుము, పెసర మొదలైన వాటిల్లో పోషకాల లోపాలు, చీడలు, తెగుళ్ల, కలుపు పెరుగుదల ఎక్కువయ్యే అవకాశం ఉందని తెలిపారు. వీటిని నివారించేందుకు యాజమాన్యపద్ధతులు పాటించాలని సూచించారు.

పత్తి పంటలో...

అధిక వర్షాల కారణంగా పత్తి పంటలో ఎక్కడైతే నీరు నిల్వ ఉంటుందో అక్కడ తక్షణమే నీటిని వెలికితీసివేయాలి. పై పాటుగా పోషకాలు అందించడానికి 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ 13-0-45 లేదా యూరియా 10గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

వర్షాల కారణంగా పంట మొక్కలు ఎక్కడన్నా ఎండిపోతున్నట్లుగా గమనించినట్లయితే అక్కడ కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రా. లేదా కార్బన్ డిజం 1గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు మొక్కల అడుగుభాగం తడిచేట్లు పిచికారి చేసుకోవాలి. పంటలో అంతర్కృషి చేయలేకపోతే గడ్డిజాతి కలుపు నివారణకు ఎకరానికి క్విజలోఫాస్ ఇథైల్ 400 మి.లీ. లేదా ప్రోపాక్విజఫాప్ 250 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి. గడ్డిజాతి, వెడల్పాటి కలుపు నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. మందుతోపాటు పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీ. ఎకారానికి పిచికారి చేయాలి. కలుపు లేతదశలో 2-4ఆకుల దశలో పిచికారి చేసుకుంటే కలుపు నివారణ బాగుంటుంది.


పత్తితో నిలిచిన నీరు

వరినారుమళ్లలో...

వర్షాలకు వరి నారుమడిలో కలుపు యాజమాన్యం ఆటంకంగా మారుతుంది. బిస్పైరిబాక సోడియం అనే కలుపు మందును 0.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి విత్తిన 8-10రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి గడ్డిజాతి కలుపు ఉంటే విత్తిన 15-20రోజులకు సైహాలోఫాప్-పి-బ్యూటైల్ అనే మందును 1.5మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

అధిక వర్షాల వల్ల ఇనుపధాతు లోపాన్ని గమనిస్తే పంట లేదా మొక్క వయస్సు మరియు ఎదుగుదల బట్టి 2 నుంచి 5గ్రా. అన్నబేధి +0.5 నుంచి 1గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి

మినుము-పెసర పంటలో..

అధిక వర్షాల వల్ల సాధారణంగా శాఖీయపెరుగుదల అధికంగా ఉండి ఆకురొట్ట ఎక్కువగా ఉంటుంది దీని వలన పొగాకు లద్దెపురుగు ఆశించి నష్టపరుస్తుంది. పంటలో జిల్లేడాకులు కనబడినట్లయితే లద్దెపురుగు ఆశించినట్లుగా గుర్తించి వెంటనే గ్రుడ్ల సముదాయం, పిల్లపురుగులు ఉన్న జిల్లేడుఆకులను తీసివేయాలి.

తొలిదశలో లార్వాల నివారణకుఎసిఫేట్ 1.5గ్రా.లేదా క్రినాల్ఫాస్ 2.0 మి.లీ. మరియు ఎదిగిన లార్వాల నివారణకై థయోడికార్బ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి

కంది పంటలో..

కందిలో అంతర్కృషి సాధ్యం కాని పరిస్థితుల్లో కలుపు నివారణకు విత్తిన 20రోజులకు ఇమజితాఫర్ 300 మి.లీ. ఎకరానికి ఒక లీటరు నీటికి 1.5మి.లీ. మందు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ఇలా చేస్తే గడ్డి మరియు వెడల్పాటి కలుపును నివారించుకోవచ్చు.

కంది పంట ఎక్కువ నీటి ముంపును తట్టుకోలేదు. పంటలో వర్షపు నీరు నిల్వఉండకుండా ఎప్పటికప్పుడు చిన్న చిన్న కాల్వలు తీసి నీటిని బైటకుతీసివేయాలి.

కేటీపీఎస్ కాంప్లెక్స్ సమస్యలను పరిష్కరించండి

» హెచ్-142 యూనియన్ నాయకులు

పాల్వంచ, జూలై 24: పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్లోని వివిధ సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జెన్కో, ట్రాన్స్కో సీఎండీ రొనాల్డ్ రోస్కు హెచ్-142 యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. హెచ్-142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ఆద్వర్యంలో బుధవారం నాయకులు రొనాల్డ్ రోస్ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కేటీపీఎస్ హాస్పిటల్లో డిజిటల్ ఎక్స్రే విధానాన్ని రూపొందించాలని, అధునాతన లేబరేటరీని ఏర్పాటు చేయాలని, కార్మికులకు నూతన నివాస గృహాలను నిర్మించాలని, కేటీపీఎస్ 7వ దశ, బీటీపీఎస్లలో పని చేస్తున్న కార్మికులకు పీఎల్ఎఫ్ ఎలవెన్స్ ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ అతి త్వరలోనే రెండు కర్మాగారాలను సందర్శించి సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యరాజ్ స్టీవెన్, కేటీపీఎస్ 7వ దశ ప్రాంతీయ అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు, పుల్లారావు, శ్రీధర్, స్వామి పాల్గొన్నారు.


సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిండుకుండలా కిన్నెరసాని

» ఇన్ఫ్లో 4వేల క్యూసెక్కులు

పాల్వంచ రూరల్, జూలై 24: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి 4వేల క్యూసెక్కులచొప్పున నీరు చేరుతోంది. బుధవారం జలాశయం నీటి మట్టం 402.4 అడుగులకు పెరిగింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, పాకాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి నీటి వరద వస్తోంది. దీంతో కిన్నెరసానికి వరదనీరు క్రమేపీ పెరుగుతోంది. ప్రాజెక్టు అసలు సామర్థ్యం 407 అడుగులుకాగా వరదనీరు పెరగడంతో 404 అడుగుల మేరకు నీటిని నిల్వచేసి ఆపై వరద నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ రామకృష్ణ తెలిపారు.


402.4 అడుగులకు చేరిన నీటి మట్టం

ఏజెన్సీలో
ప్రసవ వేదన

(5వ పేజీ తరువాయి)

200 పడకల ఈ ఆసుపత్రిలో అన్ని రకాల అధునాతన పరికరాలు ఉన్నా ప్రసూతి వైద్యులు లేకపోవడం పెద్ద లోటుగా మారింది. రెగ్యులర్గా ప్రసూతి వైద్యులు, సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు కలిసి కనీసం ఎనిమిది మంది వైద్యులు ఉండాలని తెలుస్తోంది. కానీ ఇక్కడ ఏడాదిన్నర కాలంగా ఒక్కరిని కూడా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నియమించకపోవడం గమనార్హం. దాంతో ఈ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో కేవలం ఒక్క ప్రసూతి వైద్యురాలే అందుబాటులో ఉన్నారు.

ప్రసవాల్లో నాడు రాష్ట్రానికే ఆదర్శం

భద్రాచలం వైద్యశాలలో ప్రతిరోజు 50మందికి పైనే గర్భిణులు వైద్య పరీక్షలకు వస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం భద్రాద్రి జిల్లా నుంచే కాకుండా సరిహద్దున ఉన్న ఏపీ, ఛత్తీసగఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారు కూడా ప్రసవం కోసం ఇక్కడికి వస్తుంటారు. గతంలో రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలు నిర్వహించే ఏరియా వైద్యశాలల్లో భద్రాచలం వైద్యశాఖ మొదటి స్థానంలో నిలిచేది. కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా మారిందని వైద్యశాఖ వర్గాలే వాపోతున్నాయి. గర్భిణులకు ఎంతో ముఖ్యమైన టిఫా స్కాన్ నిర్వహించేందుకు కూడా ఇక్కడ రెగ్యులర్ రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ విభాగం ఉన్నా నిరుపయోగంగా మారింది. వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే బయట నుంచి రేడియాలజిస్టులు ఇక్కడికి వస్తున్నట్లు సమాచారం. దీంతో ఎంతో ఖరీదైన టిఫా స్కానింగ్ను నిరుపేద గిరిజన గర్భిణులు ప్రైవేటులో చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇదిలా ఉండగా వైద్యులు, సిబ్బంది తగినంత స్థాయిలో లేకపోవడంతో పాటు పలు ఇతర కారణాలతో ఇటీవలి కాలంలో భద్రాద్రి వైద్యశాల నుంచి బయటి ప్రాంతాలకు రిఫరల్ కేసులు అధికమయ్యాయనే అభిప్రాయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పాముకరిచి యాజమాని..
రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

● దుబ్బతండా వద్ద ఘటన

కారేపల్లి, జూలై24: పాము కరిచిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ జరిగిన ప్రమాదంలో అతడితో పాటు మరో వ్యక్తి మృతి చెందిన సంఘటన దుబ్బతండా వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మేకలతండాకు చెందిన జాటోత్ సైదులు(29)కు సంబంధించిన డైరీఫాంలో ఇటీవల ఫాం హౌజ్ కట్టిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం డైరీ ఫాం వద్దకు వెళ్లాడు. ఫాం హౌజ్లో గేదెల కోసం గడ్డి కోస్తుండగా, పాము కరిచింది. కాగా ఏదో పురుగు కుట్టి ఉంటుందులేనని అనుకున్నాడు. కాని కొంతసేపటికి ఒళ్లంతా తిమ్మిరిగా ఉందని, ఆస్పత్రికి వెళ్లాలని, అతడి వద్ద పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన కూలీ సాముల్కసబ్(35)ను తీసుకొని ద్విచక్ర వాహనాన్ని స్వయంగా నడుపుకుంటూ వెళ్తుండగా, దుబ్బతండా గ్రామ సమీపంలో కల్వర్టుని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఇరువురు సమీపంలోని గుంతలో పడిపోయారు. స్థానికులు వారిని గమనించి 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు ఇద్దరు మృతి చెందినట్లు నిర్ధారించారు. సైదులు తండ్రి వీరన్న ప్రస్తుత్తం రాష్ట్ర మంత్రి రాజనర్సింహ దగ్గర పీఏగా పని చేస్తున్నాడు. సైదులుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వ్యవసాయం పండుగే..

» వరుస వానలతో నిండిన చెరువులు » ఘననీయంగా సాగవుతున్న పత్తి » రైతుల్లో ఆనందోత్సాహాలు


కొణిజర్ల మండంలో ఏపుగా పెరిగిన పత్తి

ఖమ్మం, జూలై 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల కురిసిన భారీవర్షాలతో ఉమ్మడిజిల్లాలో సాగు కళ కనిపిస్తోంది. వేసిన పంటలన్నీ పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. ప్రాజెక్టులు,చెరవులు జలకళ సంతరించకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో వైరా, లంకసాగర్ బేతుపల్లి, కిన్నరసాని, తాలిపేరు వంటి ప్రాజెక్టులు చెరువులన్నీ జలంతో నిండిపోయాయి. దీంతో వరినాట్లకు డోకాలేని పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు సాగర్ ఎగువ భాగంలో కురిసిన వర్షాలతో శ్రీశైలం కూడా నిండడం, నాగార్జునసాగర్ ద్వారా నీరు విడుదలయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. సాగర్ నిండితే జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద కూడా పంటపొలాలు పుష్కలంగా సాగయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇటీవల కురిసిన భారీవర్షాలతో పెదవాగు ప్రాజెక్టు గండి పడిన విషయం విదితమే. అదే వచ్చేఏడాదికి మరమ్మతులు చేసే అవకాశం నెలకొంది. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పీఆర్, ఐటీడీఏకి చెందిన సుమారు 2వేల చెరువుల్లో కూడా నీరు రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పత్తి పంట ఈఏడాది గణనీయంగా సాగవుతుంది ఖమ్మంజిల్లా పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 55,150 ఎకరాల్లో వరినాట్లు వేయగా మొక్కజొన్న 1707 ఎకరాలు, పత్తి 18605 ఎకరాలు, చెరుకు 41, వేరుశనగ 44, మినుము 68, పిల్లిపెసర 13606 ఎకరాల్లో వేశారు. కంది 171 ఎకరాలు, జనుము 32880,నువ్వులు 2846 ఎకరాల్లో వేశారు. మొత్తం ఖమ్మంజిల్లాలో 5,96,662 ఎకరాలుకు గాను సుమారు 3లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. మిర్చి తోటలు ఇంకా వేయలేదు.

జిల్లాలో ఇప్పటి వరకు జూన్లో 124.6మి.మీ. వర్షానికిగాను 198.8 మిమీ.వర్షపాతం నమోదయింది. జూలైలో కూడా ఇప్పటి వరకు 193.2 మి.మీ.వర్షపాతం కురవాల్సి ఉండగా 270.9 మి.మీ. వర్షపాతం కురిసింది. అదనంగా జులైలో వర్షం పడింది. భద్రాద్రి జిల్లాలో కూడా జూలైలో భారీగా వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 4,71,622 ఎకరాలకు గాను ఇప్పట వరకు 3,98,126 ఎకరాల్లో పంటలు వేశారు. వరి 14,568ఎకరాలు, పత్తి 118263, మొక్కజొన్న 41025, కంది 604, పెసర 46, చెరుకు 42, జనుము 4705, ఆయిల్పామ్ 64436 ఎరాల్లో పలు పంటలు సాగుచేస్తున్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలకు..

» ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ఖాన్

రఘునాథపాలెం, జూలై 24: విధుల్లో చేరిన అనతికాలంలోనే జిల్లా పాలనపై తనదైన ముద్ర వేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ఖాన్... బుధవారం స్కూలు విద్యార్థిగా మారిపోయారు. క్లాస్ రూమ్లో విద్యార్థులతో కలిసి కూర్చొని వారితో ముచ్చటించారు. పాఠశాల విద్యలో వేసుకున్న పునాదే జీవితాన్ని మలుపు తిప్పుతుందని తెలిపారు. కష్టపడి చదివి ఉన్నతశిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్ఖాన్ బుధవారం వి వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల తరగతిలోకి వెళ్లి వారి మధ్య కూర్చొని మాట్లాడారు.


ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే భవిష్యత్లో ఏ రంగంలోకి వెళ్తారో లక్ష్యంగా పెట్టుకొని తమ ఆశయాన్ని పుస్తకంలో రాసుకొని ప్రతి రోజు లేవగానే పుస్తకంలో రాసిన ఆశయాన్ని చదువుకొని పట్టుదలతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. చదువు ద్వారా ఉన్నత శిఖరాలకు వెళ్లటం ద్వారానే గుర్తింపు, ప్రత్యేకత వస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఏ మేరకు చదువుకున్నారో తెలుసుకున్నారు. అందరు విద్యార్థులు తమ తల్లిదండ్రులు పదో తరగతి లోపు చదువుకున్నారని కలెక్టర్కు వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుకునేందుకు సౌకర్యాలు పెరిగాయని, ఉన్నటువంటి సౌకర్యాలతో ఉన్నతస్థాయి విద్యకు చేరుకోవాలని సూచించారు.

ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు విద్యలో విద్యార్థులు ఎంత జ్ఞానం పొందితే వారు అంత ఉన్నత స్థాయి చదువులకు వెళ్తారని తెలిపారు. పదో తరగతి పరీక్షలు జీవితాన్ని మార్చి వేస్తాయని ఉద్యోగాలు వచ్చిన సమయంలో పదో తరగతి మార్కులు ప్రభావం చూపుతాయని చెప్పారు. టీవీలు చూస్తూ షికార్లు చేస్తూ కాలం వెళ్లదీస్తే భవిష్యత్లో ఎంత చదివినా విద్యాభ్యాసం ముందుకు వెళ్లదని వివరించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంటశాల, తాగునీరు సరఫరా, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

తగ్గుతోంది కానీ..

» భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం
» రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
» ప్రస్తుత నీటమట్టం 45.2 అడుగులు

భద్రాచలం, జూలై 24: భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. మంగళవారం 51.6 అడుగుల గరిష్ట నీటిమట్టానికి చేరిన గోదావరి అనంతరం తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 3.51గంటలకు 47.9 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ క్రమంలో తగ్గుతూ సాయంత్రం 6 గంటలకు 45.2 అడుగులకు తగ్గింది. అయితే 44అడుగుల వరకు తగ్గిన అనంతరం కొద్దిసేపు నిలకడగా ఉండి బుధవారం అర్ధరాత్రి నుంచి మళ్లీ పెరిగే అవకాశాలున్నాయి. ఎగువన ప్రాణహిత పరిసరాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆ వరద నీరు గోదావరిలో కలుస్తోంది. ఈ క్రమంలో గురువారం రెండో ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి 45 అడుగులకు తగ్గడంతో భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలక రాకపోకలు పునరుద్ధరించారు. గోదావరి నీటిమట్టం మళ్లీ పెరిగే అవకాశం ఉండటంతో నదీ పరివాహక ప్రాంతంలోని అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే సెక్టోరియల్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.


భద్రాచలం వద్ద గోదావరి వరద

అక్కడ అలా.. ఇక్కడ ఇలా...

● 'నో డ్యూ' ఇవ్వడానికి డీసీసీబీ బ్రాంచ్ల్లో రూ.50 చార్జ్
● ఉచితంగా ఇస్తున్న జాతీయ బ్యాంకులు
● సహకార బ్యాంకులో ఇదే పద్ధతంటున్నరైతులు


వైరా డీసీసీబీ బ్రాంచ్

వైరా, జూలై 24: ఖమ్మంజిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో రైతులపై నో డ్యూ పత్రం (బాకీ లేదని ధ్రువీకరించడం) భారాన్ని విధిస్తున్నారు. ఇతర బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకునే రైతులకు అప్పు లేనట్లు ధ్రువీకరించేందుకుగానూ డీసీసీబీ పరిధిలోని అన్ని బ్రాంచ్ల్లో రైతుల నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. మిగిలిన వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో నో డ్యూ సర్టిఫికెట్లకు వెళ్లిన రైతుల నుంచి ఒక్కపైసా కూడా వసూలు చేయడం లేదు. కానీ రైతుల సేవ కోసమే తామున్నామని చెప్పుకున్న సహకార బ్యాంకుల్లో మాత్రం రైతుల నుంచి నో డ్యూ సర్టిఫికెట్లకు కూడా డబ్బులు వసూలు చేయటాన్ని పలువురు నిరసిస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 51 డీసీసీబీ బ్రాంచ్లున్నాయి. అన్ని బ్రాంచ్ల్లో కూడా నో డ్యూ సర్టిఫికెట్ కోసం వెళ్లిన రైతుల నుంచి విధిగా రూ.50 వసూలు చేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలోని అన్ని బ్రాంచ్లో రూ.20వేలకు పైగా మొత్తాన్ని నో డ్యూ సర్టిఫికెట్ల కోసం రైతులు సమర్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నేళ్ల కిందట వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో నో డ్యూ సర్టిఫికెట్ల కోసం రైతుల నుంచి సర్వీస్ కింద కొంత మొత్తాన్ని వసూలు చేసేవారు. అయితే గత ఐదారు సంవత్సరాల నుంచి ఆబ్యాంకుల్లో నో డ్యూ సర్టిఫికెట్లకు రుసుం వసూలు చేయటాన్ని బంద్ చేశాయి. ఆ సమయంలో నో డ్యూ కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేయాలని నాలుగైదేళ్ల కిందట అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీసీబీ తమ బ్రాంచ్లకు ఒక సర్క్యులర్ జారీ చేసింది. మారిన పరిస్థితుల్లో వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు రైతుల నుంచి నో డ్యూ సర్టిఫికెట్ కోసం డబ్బులు వసూలు చేయటాన్ని బంద్ చేసినప్పటికీ రైతుల బ్యాంకుగా భావిస్తున్న డీసీసీబీ బ్రాంచ్ల్లో మాత్రం యధావిధిగా నో డ్యూకు డబ్బులు వసూలు చేస్తున్నారు.

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మొదటి విడతలో రూ.లక్ష రుణమాఫీ పొందిన రైతులు తిరిగి కొత్తగా రుణాలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా కొన్నినెలల కాలంలో కొత్తగా పట్టాదారు పాస్పుస్తకాలు పొందిన రైతులు కూడా బ్యాంకుల్లో రుణాలు తీసుకొనేందుకు సిద్ధపడ్డారు. తమ పెట్టుబడి అవసరాల కోసం రైతులు విధిగా పంటరుణాలు తీసుకుంటున్నారు. వాణి జ్య బ్యాంకుల్లో రుణాలు కావల్సిన రైతులు విధిగా సహకార సంఘాలు, డీసీసీబీల నుంచి నోడ్యూ ధ్రువీకరణ తీసుకురావాల్సి ఉంది. నో డ్యూ ఇచ్చేందుకు డీసీసీబీల్లో రూ.50చొప్పున వసూలు చేస్తున్నారు. దీనివలన డీసీసీబీలకు లక్షలాది రూపాయల ఆదాయం వస్తుండగా, ఆ మొత్తాన్ని రైతులు నష్టపోవాల్సి వస్తుంది. జిల్లా కలెక్టర్ అలాగే డీసీసీబీ యాజమాన్యం, అధికారులు తగు చర్యలు తీసుకొని నో డ్యూ సర్టిఫికెట్లకు డబ్బులు వసూలు చేయటాన్ని నిలిపివేస్తూ తగిన ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులు రిమాండ్

ఘట్కేసర్ రూరల్, జూలై 24 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ రంగారెడ్డి, ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్ చేశారు. ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి-కొత్తగూడెం, ఇల్లెందుకు చెందిన పల్రె చరన్(20), మంచిర్యాల్, శ్రీరాంపుర్కు చెందిన సంజయ్మిశ్రా(23)లు నారపల్లి చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని ఆపి తనిఖీ చేస్తుండగా, సంజయ్మిశ్రా అక్కడి నుంచి పరారయ్యాడు. చరణ్ను అదుపులోకి తీసుకోని విచారించగా అతని వద్ద 1.087 గ్రాముల గంజాయి, సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఖమ్మం జిల్లా, సత్తుపల్లి, కాకారేపల్లికి చెందిన గాదె నితిన్చౌదరి(22), నారపల్లిలో ఉంటూ ఓ ఇంజనీరింగు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. నారపల్లి, పోచారం, సంస్కృతిటౌన్షిప్లో గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం మేరకు అతడిని అదుపులోకి తీసుకోని అతని వద్ద నుంచి 200 గ్రాముల గంజాయితో పాటు సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

సర్కారు బడులకు కొత్త రూపు

- అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మౌలిక వసతులు
- పర్యవేక్షణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగింత
- జిల్లాలో రూ.31 కోట్లతో పనులకు అనుమతులు
- వివిధ పాఠశాలల్లో చురుగ్గా కొనసాగుతున్న పనులు



మాటూరు ప్రభుత్వ పాఠశాలలో పూర్తైనా మూత్రశాలలు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను నియమించింది. ఇదివరకటి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల స్థానంలో ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. పనుల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేశారు.. మౌలిక వసతుల కల్పన, పాఠశాలల బలోపేతానికి అవసరమైన పనులను చేపట్టే బాధ్యతలను వీరికి అప్పగించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో నిర్వహణ బాధ్యతలను ఇక నుంచి మహిళా స్వయం సహాయక సంఘాలు చేపట్టనున్నాయి.

ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలో మొత్తం 955 పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేశారు. మొత్తం పాఠశాలలకు రూ. 31 కోట్ల వ్యయంతో పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జిల్లాలో రూ.కోటి 45 లక్షలతో 548 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తికాగా మిగిలిన 407 పాఠశాలల్లో పనులు నిర్వహిస్తున్నారు. దీనికి గాను ప్రభుత్వం రూ.కోటి45 లక్షలను ఖాతాల్లో జమచేసింది. పాఠశాలల్లో డ్యూయల్ డెస్కులకు, గ్రీన్‌బోర్డులకు, పెయింటింగ్‌లకు సంబంధించి రూ.7కోట్ల19 లక్ష లు మంజూరు చేసింది. పాఠశాల పేరుతో గతంలో ఎస్ఎంసీ ఖాతా ఉండేది. ఇపుడు అమ్మ ఆదర్శ కమిటీల ఎంపికతో పాఠశాల చైర్‌పర్సన్, కన్వీనర్ పేరుతో మరో ఖాతాను తెరవాలని విద్యాశాఖ అధికారులు సూచించడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చైర్‌పర్సన్‌లతో కలిసి కొత్త ఖాతాలను తెరిశారు. ఇందులో ఇద్దరికీ చెక్‌పవర్ ఉంటుంది.



సిరిపురం ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి ట్యాంక్

కమిటీల నిర్మాణం..

ఆయా గ్రామ, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు (వీవో) అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చైర్‌పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థుల తల్లుల్లో ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున కమిటీలకు సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరు మహిళా స్వయం సహాయక సభ్యులై ఉండాలి. ఈ ముగ్గురిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ అయి ఉండాలి. గ్రామంలో ఒకే వీవో ఉండి పాఠశాలలు ఎక్కువగా ఉన్న చోట ఆ వీవో అన్ని పాఠశాలలకు చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఎక్కువ సంఖ్యలో వీవోలు ఉంటే రొటేషన్ పద్ధతిలో ఆయా పాఠశాలలకు చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఈ కమిటీలు విద్య, పాఠశాలల నిర్వహణలో పాలు పంచుకోనున్నాయి. పాఠశాలల పర్యవేక్షణ, బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యాలు, బడుల మరమ్మతులు, విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మా ణం, పాతవి పునరుద్ధరణ, తరగతి గదుల విద్యుదీకరణ, పారిశుధ్య నిర్వహణ, సోలార్ పానెళ్ల ఏర్పాటు, విద్యార్థుల యూనిఫాం తయారీ తదితర అంశాలు ఈ కమిటీలు చేపట్టాల్సి ఉం టుంది. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తుంటారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరు పర్యవేక్షణతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూస్తారు.

రూ.25 వేల వరకు...

పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో రూ.25 వేల వరకు అయ్యే పనులకు టెండర్లు లేకుండా చేస్తారు. అంతకుమించిన పనులు ఉంటే టెక్నికల్ కమిటీలు జిల్లా సమాఖ్యల ద్వారా పాలనాధికారులకు నివేదిస్తాయి. ఏఈ, డీఈ పనుల రికార్డులను ఎంబీలో నమోదు చేస్తారు. రూ.లక్ష దాటితే కలెక్టర్ల పర్యవేక్షణలో చెల్లిస్తారు. పనులు పూర్తయ్యాయని ప్రధానోపాధ్యాయు డు ధ్రువీకరించిన తరువాతే బిల్లులు చెల్లిస్తారు.

వివిధ మండలాల్లో పనుల వివరాలు

బోనకల్ మండలంలో 37 పాఠశాలలకుగాను రూ.81 లక్షల 50 వేలు, చింతకానిలో 32 పాఠశాలలకు రూ.97లక్షల 25 వేలు, ఏన్కూర్‌లో 44పాఠశాలలకు రూ.2 కోట్ల 21 లక్షల 65 వేలు, కల్లూరులో 41 పాఠశాలలకు రూ.కోటి 12లక్షల 45వేలు, కామేపల్లిలో 40 పాఠశాలలకు రూ.కోటి 3లక్షల 50వేలు, ఖమ్మం రూరల్‌లో 57 పాఠశాలలకు రూ.కోటి 36లక్షల 91 వేలు, ఖమ్మం అర్బన్‌లో 51 పాఠశాలలకు రూ.కోటి 86 లక్షల 82వేలు, కొణిజర్లలో 38 పాఠశాలలకు రూ.కోటి 16 లక్షల 12 వేలు, కూసుమంచిలో 62 పాఠశాలలకు రూ.కోటి 80 లక్షల 85 వేలు, మధిరలో 36 పాఠశాలలకు రూ.కోటి ఒక లక్షా 20 వేలు, ముదిగొండలో 44 పాఠశాలలకు రూ.కోటి 25 లక్షల 30వేలు, నేలకొండపల్లిలో 53 పాఠశాలలకు రూ.2కోట్ల 36 లక్షల 93 వేలు కేటాయించారు.

పెనుబల్లిలో 57 పాఠశాలలకు రూ.కోటి 86 లక్షల 45 వేలు, రఘునాథపాలెంలో 56 పాఠశాలలకు రూ.కోటి 85 లక్షల 74 వేలు, సత్తుపల్లిలో 50 పాఠశాలలకు రూ.కోటి 10 లక్షల 37 వేలు, సింగరేణిలో 58 పాఠశాలలకు రూ.కోటి 97 లక్షల 60వేలు, తల్లాడలో 29 పాఠశాలలకు రూ.78 లక్షల 50 వేలు, తిరుమలాయపాలెంలో 62 పాఠశాలలకు రూ.2కోట్ల 30 లక్షల 98వేలు, వేంసూర్‌లో 40 పాఠశాలలకు రూ.కోటి 20లక్షల 25వేలు, వైరాలో 34 పాఠశాలల్లో రూ.94 లక్షల 31 వేలు, ఎర్రుపాలెంలో 35 పాఠశాలలకు రూ. 96 లక్షల 27 వేలు కేటాయించారు. మొత్తం పనులకు రూ.31 కోట్ల 93 వేల పనులు అంచనాలు వేయగా అందులో రూ.కోటి 45 లక్షలు అడ్వాన్స్‌గా మంజూరు చేశారు.

మహిళాశక్తి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి

● కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 24: ప్రభుత్వం మహిళాశక్తి కింద చేపట్టిన వివిధ కార్యక్రమాలకు లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్ లో అధికారులతో మహిళా శక్తి కార్యక్రమ యూనిట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వారిగా మహిళా శక్తి కార్యక్రమ కార్యాచరణ చేయాలన్నారు. దీనిలో భాగంగా ఆయా ప్రాంతంలో ఉన్న డిమాండ్‌ను బట్టి యూనిట్ల ఎంపిక చేయాలన్నారు. బ్యాంకు లింకేజ్ రుణాలతో వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటు కోసం లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని పేర్కొన్నారు. ఇదివరకే ఆయా యూనిట్లను నడుపుతూ, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒకే గ్రామం, ప్రాంతంలో ఒకే తరహా యూనిట్లు ఒకటి కంటే ఎక్కువ ఏర్పాటు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూనిట్ క్యాచ్‌మెంట్ ఏరియా లాభదాయకంగా ఉండేలా చూడాలన్నారు. మండలాల వారీగా గుర్తించి, ఎంపికయిన యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సూచించారు. యూనిట్ల గ్రౌండింగ్ నుంచి, యూనిట్లు ఆయా వ్యాపారంలో నిలదొక్కుకునేలా కొంతకాలం అధికారులు పర్యవేక్షణ చేస్తూ, సహకారం అందించాలన్నారు. సృజనాత్మక యూని ట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలని, ఈ దిశగా వ్యాపార ధోరణితో ఎదగాలని ఉత్సాహంగా ఉన్న మహిళా సంఘాలకు ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డీవో సన్యాసయ్య అదనపు డిఆర్డీవో నూరోద్దీన్, డీపీఎం లు శ్రీనివాసరెడ్డి, రేవతి, దర్గయ్య, డి. శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

● సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీ సత్యనారాయణ

కల్లూరు, జూలై 24 కల్లూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ అన్నారు. కల్లూరులోని వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల రక్షణ కరువైంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో 'ఈ వసతి గృహంలో ఉండలేం' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి బుధవారం వసతి గృహాన్ని పరిశీలించారు. సుమారు రూ.3 లక్షల అంచనాతో మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు. పది రోజుల వ్యవధిలో వసతి గృహ భవనాన్ని మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. వసతి గృహానికి పర్యవేక్షణగా మరో అధికారిని వైరా నుంచి ఇన్‌చార్జిగా నియమించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇకపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. వసతి గృహంలో 40 కిపైగా విద్యార్థులు ఉంటున్నారన్నారు. స్థానికంగా వసతి గృహ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సంక్షేమ వసతి గృహం అధికారి స్టాలిన్ పాల్గొన్నారు.

బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలి: రైతులు

ఖమ్మం రూరల్, జూలై 24: బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం తమ భూముకు పరిహారం చెల్లించాలని నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు తేల్చిచెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కింద భూములు కోల్పోతున్న రైతుల భూములలో చెట్లు, పండ్లచెట్లు, బావులు, బోర్లు, పైపులైన్లు తదితర వివరాలు సేకరించేందుకు రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులు బుధవారం మండల పరిధిలోని కామంచికల్ గ్రామానికి చేరుకున్నారు.

దీనికి బాధిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ భూములకు ఇచ్చే పరిహారం ప్రకటించకుండా సర్వే చేయడానికి వీలులేదని పే ర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ఎకరం రూ.2 కోట్లు ఉందని గుర్తు చేశారు. పరిహారం, సర్వీస్ రోడ్లు, ఇతర సమస్యలు పరిష్కారం కాకుండా తమ భూముల్లో సర్వే చేయడానికి వీలులేదని బాధిత రైతులు సర్వేకి వచ్చిన అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతి కుమార్, జాతీయ రహదారులశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సెల్ చార్జీలు పెంచేది లేదు

- డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 24: "భారత్‌సంచార్ నిగమ్ లిమిటెడ్ భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ సెల్ వినియోగదారుల టారిఫ్‌ను పెంచేది లేదని అతి తక్కువ ధరలకే సెల్ సేవలను అందిస్తుందని" బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన బీఎస్ఎన్ఎల్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ప్రైవేట్ సెల్ నెట్‌వర్క్స్ విపరీతమైన రేట్లను పెంచి వినియోగదారుల నడ్డివిరుస్తున్నారని కానీ బీఎస్ఎన్ఎల్ మాత్రం అతి తక్కువ ఖర్చుతో సెల్‌సేవలను అందిస్తుందన్నారు. కేవలం రూ.249లకు 2జీబీ, అన్‌లిమిటెడ్ కాల్స్, 45 రోజుల వ్యాలిడిటీతో ముందుకొచ్చిందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా త్వరలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను కూడా ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు, సిగ్నళ్లను అందించేందుకు ప్రస్తుతం ఉన్న 436 టవర్లను ఆధునికీకరించడంతో పాటు, కొత్తగా మరో 44 టవర్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. 4జీ సాచురేషన్ ప్రాజెక్టు కింద వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2లక్షల 27 వేల సెల్‌వన్ వినియోగదారులు ఉండగా, గత నెల రోజులుగా జిల్లాలో 6వేల కొత్త కనెక్షన్లు, మరో 3వేల వరకు పోర్ట్ కనెక్షన్లు బీఎస్ఎన్ఎల్‌కు వచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఖమ్మంలో-2, ఇల్లెందు, పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలంలో మొత్తం వినియోగదారుల సేవా కేంద్రాల్లో సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సిబ్బంది అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఎఫ్‌టీటీహెచ్ ద్వారా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్‌తో పాటు డీటీహెచ్ సేవలను బీఎస్ఎన్ఎల్ అందిస్తోందన్నారు. దీనికోసం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ప్రతి ఇంటింటికీ తిరిగి ఉత్పత్తులపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తోన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సేల్స్ ఏజీఎం సుష్మ, సెల్‌వన్ ఏజీఎం డి. సుధీర్, రాంకుమార్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలపై ప్రజలకు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో బుధవారం బీఎస్ఎన్ఎల్ సంస్థ ఉద్యోగులు ఖమ్మం నగరంలో ర్యాలీ నిర్వహించారు.



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు

జీఎం కార్యాలయం వద్ద ఈ ర్యాలీని డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. బీఎస్ఎన్ఎల్ సేవలను సద్వినియోగించుకోవాలని ప్లకార్డులతో ప్రదర్శనలో పాల్గొన్నారు. మీ ఇంటి గుమ్మం, వీధి వరకు బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తృత పరుస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ ర్యాలీలో సెల్‌వన్ ఏజీఎం సుధీర్, ఏ సుష్మ, రాంకుమార్, దుర్గారావు, సీహెచ్ శ్రీనివసారావు, పున్నారావు, రాంబాబు, ప్రసాద్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

28న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 24: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 బాలురు, బాలికలు విభాగాలతో పాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆగస్టు 7న సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 8 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

వీఎంబంజర్‌లో చోరీలు

పెనుబల్లి, జూలై 24: వీఎంబంజర్‌లోని కొత్తగూడెం రోడ్డులో రెండు దుకాణాల్లో షట్టర్ల తాళాలు పగులగొట్టి నగదు చోరీ చేసిన సంఘటనలు జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి వీఎంబంజర్‌లోని కొత్తగూడెం రోడ్డులో ఆచంటి పుల్లారావు, నాగుబండి ప్రభాకర్ దుకాణాల షట్టర్ల తాళాలను పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పుల్లారావు దుకాణంలో రూ.ఐదువేల నగదు, ప్రభాకర్ దుకాణంలో కొద్ది మొత్తంలో నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. దీంతో పాటు శాంతి ఫొటోస్టూడియో, జిల్లెళ్ల ప్రసాద్‌కు చెందిన మోటారుసైకిల్‌ను చోరీ చేసి కొత్తగూడెం రోడ్డులో కొంతదూరం తీసుకువెళ్లి పెట్రోల్ అయిపోవడంతో దొంగలు వదిలేసి వెళ్లిపోయారు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫారం ధ్వంసం

తల్లాడ, జూలై 24: ట్రాన్స్‌ఫారాన్ని ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైర్, ఆయిల్‌ను చోరీ చేసిన సంఘటన నారాయణపురం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డెం శ్రీనివాసరెడ్డి పొలంలో గల ట్రాన్స్‌ఫారాన్ని దొంగలు ధ్వంసం చేయటమే కాకుండా అందులోని రాగి వైర్, ఆయిల్‌ను చోరీ చేశారు. దీని విలువ రూ.31 వేలు ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రాజేష్ తెలిపారు. ఈ విషయమై తల్లాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ వివరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, జూలై 24: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రానికి బాణోతు సీతారాములు(47) మద్యానికిబానిసై డబ్బుల కోసం కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం డబ్బులు ఇచ్చేందుకు వారు నిరాకరించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో పూజారికి నేను క్రిమిసంహారక మందు తాగినట్లు చెప్పడంతో బాధితుడి చిన్నకుమారుడికి పూజారి సమాచారం ఇచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన తన తండ్రిని 108 ద్వారా కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పాపయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చూస్తూ టైంపాస్ చేయొద్దు..

● భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఇల్లెందు టౌన్, జూలై 24: రోగులకు తగిన విధంగా వైద్యసేవలు అందించకుండ వైద్యశాలలో సిబ్బంది, ఉద్యోగులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరించారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతి విభాగంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులు వైద్యశాలలో సిబ్బంది సరిగా పనిచేయకుండా పట్టించుకోవడం లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. దీంతో స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి సెల్‌ఫోన్లు చూస్తూ కాలం గడపవద్దని, ప్రభుత్వం మీకు రోగులకు సేవలు అందించేందుకే జీతాలు చెల్లిస్తుందని పేర్కొన్నారు. పేర్కొంటు ఇదే విధానం కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వైద్యశాలలో ఉన్న ఔషధమొక్కలు గుర్తించిన కలెక్టర్ ఈ మొక్కలు దేనికి పని చేస్తుందని వైద్యులను ప్రశ్నించగా, వారు తెలియదంటూ దాట వేశారు. అక్కడే ఉన్న తహసీల్దార్ రవికుమార్ ఈ మొక్క షుగర్ వ్యాధికి పని చేస్తుందని తెలిపడంతో, తహసీల్దార్‌ను కలెక్టర్ ప్రశంసిస్తూ ఆయనకు ఎలా తెలిసిందంటూ వైద్యులను ప్రశ్నించారు. వైద్యశాఖ తనిఖీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లెందు వైద్యశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు ప్రకటించారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వైద్యశాలలో ఉన్న పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని త్వరలో పరిష్కారం చూపుతామని వెల్లడించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హర్ష వర్ధన్, కౌన్సిలర్లు, తహసిల్దార్ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి

● ఐటీడీఏ పీవో రాహుల్



గిరిజన సంప్రదాయ పరికరాలను పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, జూలై 24: గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతి పరిరక్షణకు ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తుందని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలో బుధవారం గిరిజన మ్యూజియాన్ని ఆయ న సందర్శించి, మ్యూజియంలోని వస్తువులను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మ్యూజియానికి అధిక సం ఖ్యలో సందర్శకులు వచ్చేందుకు తమవం తు ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు.

భద్రాచలంలోని మనుబోతుల చెరువు దగ్గర నిర్మాణం చేపడుతున్న డంపింగ్ యార్డు నిర్మాణ పనులను పీవో బి.రాహుల్ పరిశీలించారు. అలాగే పీవో బి.రాహుల్ వైటీసీని సందర్శించి కస్టమర్ కేర్ రిలేషన్‌షిప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజు, పంచాయతీ ఈవో శ్రీనివాస్, వైటీసీ సెంటర్ ఇన్‌చార్జి దివ్య పాల్గొన్నారు.

కాపాడిన కరకట్ట

- భద్రాచలంలోకి వరద రాకుండా తాత్కాలిక కరకట్ట
- మరోమారు మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల
- హర్షం వ్యక్తం చేస్తున్న భద్రాద్రి వాసులు



విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో నిర్మించిన తాత్కాలిక కరకట్ట

భద్రాచలం, జూలై 24: ఈసారి గోదావరి వరదల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 51.6 అడుగులు రాగా భద్రాచలం పట్టణంలోకి చుక్క వరద నీరు రాకుండా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గోదా వరి సోమవారం రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించడంతో ముందస్తు ప్రణాళికలో భాగంగా అధికారులు అప్పటికప్పుడు విజయవాడ-జగదల్‌పూ ర్ జాతీయ రహదారిలో భద్రాచలం శివారులో నూతనంగా నిర్మిస్తున్న 700 మీ టర్ల కరకట్ట ప్రాంతంలో రహదారిపై ఒక్కపూటలోనే తాత్కాలిక కరకట్ట ఏర్పా టు చేశారు. నీరు పెరిగితే తాత్కాలిక కరకట్టకు ఇబ్బందిలేకుండా ఇసుక బస్తాలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోకి తొలిసారి ఒక్క చుక్క కూడా వరద నీరు ప్రవేశించలేదు. వాస్తవానికి కరకట్టను వరదల సమయం నాటికి నిర్మించాల్సి ఉన్నా డిజైన్‌లో మార్పు, వర్షాలు, ఇతర సాంకేతిక కారణాల నేప థ్యంలో నిర్ణీత సమయంలో పూర్తి చేయలేకపోయినట్లు అధికారవర్గాలు తెలిపా యి.

తమ ప్రభుత్వం ఈసారి అధికారంలోకి వస్తే భద్రాచలంలోకి ఒక్క చుక్కకూడా గోదావరి వరద రానవ్వమోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో భద్రాచలంలో జరిగిన ఎన్నికల సభలో హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన మాటకు అనుగుణంగా 700మీటర్ల కరకట్ట పనులను ప్రారంభించి వేగంగా నిర్మాణం పూర్తి చేసేందుకు తరుకూ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో ఒక వేళ నూతన కరకట్ట పనులు నిర్ణీత సమయానికి పనులు పూర్తి కాకపోయినా చుక్క వరద కూడా భద్రాద్రిలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మీదేనంటూ అధికారులకు స్పష్టం చేశారు. అలాగే రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా పనుల్లో నాణ్యతతో పాటు పట్టణంలోకి నీరు ప్రవేశించకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన రెండుసార్లు నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ముందస్తుగానే తాత్కాలికకట్ట ఏర్పాటు చేయడంతో భద్రాద్రివాసులకు ఊరట లభించింది. 2023లో జూలైలో వచ్చిన గోదావరి మహావరదల సమయంలో ఎటువంటి కట్ట లేకపోవడంతో భద్రాచలంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపు కార్యాలయం, శాంతినగర్ కాలనీ, మెడికల్ కాలనీ ముంపునకు గురయ్యాయి. కాగా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకొని వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టడం పట్ల భద్రాద్రివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలి నుంచి చుక్క వరద రానివ్వనంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో సైతం గోదావరిపై భద్రాద్రి వద్ద రెండో వారధిని 2024 శ్రీరామనవమి నాటికి రాకపోకలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని చెప్పి అందుకు అనుగుణంగా ఆయన మార్గం సుగమం చేయడాన్ని వారు గుర్తు చేసుకున్నారు.

'గౌడ కులస్థులను ఎస్టీ జాబితాలో కలపాలి'

కరకగూడెం, జూలై 24: ప్రభుత్వ ఫలాలు అందక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నామని గౌడ కులస్థులను వెంటనే ఎస్టీ జాబితాలో కలపాలని గౌడ సంఘం నాయకులు రావుల రవి డిమాండ్ చేశారు. బుధవారం కరకగూడెం, పినపాక, మణుగూరు మండలాల గౌడ సంఘం సభ్యులు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం గౌడ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ కులస్థులకు రెవెన్యూ అధికారులను ఎస్టీ ధ్రువీకరణ పత్రం అందించాలని కోరారు. తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ కింద పడి ప్రాణాలు పోయిన ప్రభుత్వం నుంచి సహాయ సకరాల అందడం లేదని వాపోయారు. ఏజెన్సీలలో గౌడ కులస్థులం దుర్భరమైన జీవితాలు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కింది స్థాయి అధికారుల నుంచి పెద్ద స్థాయి అధికారుల వద్దకు వెళ్లినా మా గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. ఈ విషయంపై చైర్మన్ స్పందించారని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుర్రా లీలా వాసు, చీకటి భిక్షపతి, జలగం కనకయ్య, కొంపెల్లి నాగేశ్వరావు, చీకటి రామచంద్రయ్య, జలగం శ్రీను, కొంపెల్లి మల్లేష్, చిర్ర కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ వెంకటేశంకు వినతి పత్రం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎస్పీ




మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విపత్కర సమయాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, సైబర్‌నేరాల పట్ల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోనూతనంగా ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విపత్కర సమయాల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. భారీవర్షాల కారణంగా ఇబ్బందులకు గురైన ప్రజలకు అండగా నిలిచిన తీరు ప్రశంసనీయమన్నారు. భవిష్యత్‌లో కూడా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన అక్కడ చేరుకుని ప్రజలకు అండగా ఉంటూ వారిలో ధైర్యాన్ని నింపుతూ పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వర్, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హేమచంద్రాపురంలో గల జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఓపెన్ జిమ్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందికి వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సబ్బంది యొక్క సమస్యలు తెలుసుకున వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పోలీసు అధికారుల విశ్రాంత భవనాన్ని పరిశీలించి అధికారులకు సూచనలుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శ్రీనివాస్, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, సత్యనారాయణ, నాగరాజురెడ్డి, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, నర్సింహారావు, కృష్ణారావు, లాల్‌బాబు, రుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
8
గురువారం 25 జూలై 2024



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్


జూట్‌బ్యాగులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్/ఖానాపురం హవేలి, జూలై 24: నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో తయారుచేసిన జ్యూట్ బ్యాగులను కలెక్టర్ ముజామిల్ ఖాన్ బుధవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలన్న సామాజిక బాధ్యతతో జ్యూట్ బ్యాగులను తయారు చేయించి పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ, తమ పాఠశాలలో గత మూడు సంవత్సరాలుగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్నామని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు తమ ప్రాంతంలోని ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తనిఖీ

» ఏన్కూరు, కొణిజర్ల, కల్లూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, డీఈవో, జడ్పీ సీఈవో, సోషల్‌వెల్ఫేర్ డీడీ


ఏన్కూరు, కొణిజర్లలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్, డీఈవో

ఏన్కూరు, జూలై 24: లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. బుధవారం ఏన్కూరు జడ్పీ పాఠశాలను తనిఖీచేశారు. పాఠశాల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. 10/10 జీపీఏ సాధనకు మేళుకువలను విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు , ఆర్ఐ నవీన్‌కుమార్, పాఠశాల హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఉపాధ్యాయులు రాఘవరావు, రాధాకృష్ణ, శ్రీధర్, కస్తూరి, పుల్లయ్య, శంకర్‌రావు, చంద్రప్రకాష్, వర్జీనియా, రాంబాబు నరసింహారావు సులోచన, బీమ్‌సింగ్, హతీరాం, వీరయ్య కృష్ణవేణి, ఇక్బాల్,ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల, కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను డీఈవో సోమశేఖరశర్మ బుధవారం పరిశీలించారు. ఉదయం ప్రార్థన సమయంలో తనికెళ్ల ఉన్నత పాఠశాలను సందర్శించి హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో కొణిజర్ల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని తిని సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జడ్పీ సీఈవో, సోషల్ వెల్ఫేర్ డీడీ

కల్లూరు: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం తయారిని జడ్పీ సీఈవో వినోద్, సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వారు సహపంక్తి భోజనాలు చేసి ఆహారం రుచి చూశారు. విద్యార్థులకు వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ఆకుకూరలు, మిరపకాయలను వాడవద్దని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. అదే విధంగా విద్యార్థులకు భోజనశాల సరిపడటం లేదన్న విషయాన్ని పాఠశాల హెచ్ఎం నివేదిత వారి దృష్టికి తీసుకోరాగా పై విదంగా మరో షెడ్ ఏర్పాటు చేసేందుకు తగిన నిధుల కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు. భోజనం ఎలా వడ్డిస్తున్నారని ఇక్కడ పదార్థాలు ఎలా ఉన్నాయని వార ఆరా తీశారు. ఇంకాను ఈ పాఠశాలతో పాటుగా, బాలికోన్నత పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని కూడ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, సత్తుపల్లి సోషల్ వెల్ఫేర్ సహాయ సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీఓ సురేష్ కూడ పాల్గొని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

కొత్త నేర చట్టాలు సవరించాలి

» కేంద్ర న్యాయశాఖ మంత్రిని కలిసిన ఎంపీ వద్దిరాజు, న్యాయవాదులు


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వద్దిరాజు

ఖమ్మం, జూలై24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్రం కొత్తగా అమలులోకి తెచ్చిన నేరచట్టాలను సమీక్షించి సవరణలు తీసుకురావాలని బీఆర్ఎస్ రాజ్యసభ పక్ష ఉపనేత ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు ఖమ్మంకు చెందిన పలువురు న్యాయవాదులు ఢిల్లీలో బుధవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాంమేఘావాల్ ను కలిసి విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా పెండింగ్‌లోని సెంట్రల్ నోటరీల నియామకాలను వెంటనే చేపట్టాలని అడ్వకేట్ ప్రొటక్షన్ బిల్లు అమలుచేయాలని కోరుతూ ఎంపీ వద్దిరాజుతోపాటు సీనియర్ న్యాయవాదులు తాళ్లూరి దిలీప్‌చౌదరి,బార్ అసిసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది సంక్రాతి రాజశేఖర్ తదితరులు పార్లమెంట్‌లో కేంద్రమంత్రి చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. 2021లో సెంట్రల్ నోటరీ నోటిఫికేషన్ వేయగా 2వేల మంది న్యాయవాదులు దరఖాస్తు చేశారని, వాటిని పరిష్కరించాలని ఈసందర్భంగా సూచించారు. నేరచట్టాల్లో స్వల్ప సవరణలు చేయాలని, జిల్లా జడ్జిలు జిల్లాలో ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ న్యాయవాదుల సూచనలు స్వీకరించాలని ఇందుకు సదస్సులు ఏర్పాటుచేయాలన్నారు.

వైరా-నెమలి రూట్లో బస్సు వేళలు మార్చాలి

వైరా, జూలై 24: ఖమ్మం నుంచి వైరా మీదుగా నెమలి వరకు నడిచే ఆర్టీసీ బస్సు సమయాలను మార్చాలని కోరుతూ ఖమ్మం ఆర్టీసీ ఆర్ఎంకు ఆ రూట్‌కు చెందిన వారు ఒక వినతిపత్రం సమర్పించారు. మండలంలోని దాచాపురం, గరికపాడుకు చెందిన పలువురు ఆర్ఎంను కలిసి ఆమేరకు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ఆర్టీసీ డిపో నుంచి ఉదయం 6.30గంటలకు, అలాగే సాయంత్రం 4గంటలకు వైరా మీదుగా నెమలికి ఒక బస్సు సర్వీస్‌ను నడుపుతున్నారని అయితే ఆబస్సు సమయాన్ని ఉదయం ఉదయం 7గంటలకు, సాయంత్రం 4.15గంటలకు నడపాలని ఆవినతిపత్రంలో కోరారు.

మాజీ ఎంపీటీసీ మాగంటి సుందరమ్మ, గరికపాడు ప్రధానోపాధ్యాయుడు దొంతెబోయిన సత్యనారాయణ, పలువురు ప్రయాణీకులు ఆవినతిపత్రంపై సంతకాలు చేశారు.

నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

ఖమ్మం క్రైం, జూలై 24: జిల్లాలో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పోలీస్ శాఖ నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ట్రాన్స్‌కో విభాగంలో హెడ్ కానిస్టేబుల్ గాఉన్న పి. నారాయణ రెడ్డి, ఖమ్మం కమిషనరెట్‌లో హెడ్ కానిస్టేబుళ్లగా ఉన్న కె. శైలజ, టి.బాలస్వామి, లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరంతా ఖమ్మం కమిషనరెట్ పరిదిలోనే ఏఎస్ఐలుగా కొనసాగనున్నారు.

వీఎంబంజర్‌లో రూరల్ పోలీసుల తనిఖీలు

పెనుబల్లి, జూలై 24: మండల పరిధిలోని వీఎంబంజర్ రింగ్ సెంటర్లో బుధవారం సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగయ్య వాహనాలను తనిఖీ చేశారు. రింగ్‌సెంటర్లోని నాలుగు రహదారుల్లో వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. కార్లు, లారీలు, ద్విచక్రవాహనాలను సైతం తనిఖీ చేశారు. గంజాయి రవాణా నివారణ కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా క్రాస్ రెగ్యులేటరీ మరమ్మతు పనులు

ఏన్కూరు, జూలై 24: రూ.50లక్షలతో క్రాస్ రెగ్యులేటరి మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. నాగార్జునసాగర్ కాలవపై 52కి.మీ. సమీపంలో ఉన్న రెగ్యులేటరీ శిథిలావస్తకు చేరడం, సీతారామ లింక్‌కెనాల్‌ను 51.490 కి.మీ. దగ్గర అనుసంధానం చేయడంతో నీటి ప్రవాహ వేగాన్ని తట్టుకునేందుకు రెగ్యులేటర్‌ను మరింత పటిష్టంగా ఏర్పాటుచేస్తున్నారు. కొత్త గేట్లు, షట్టర్లను అమరుస్తున్నారు.ఏన్కూరు నుండి తిమ్మరావుపేట, వరు సుమారు 13కి.మీ. జంగిల్ కటింగ్ పనులు ప్రధానకాలవ కట్ట నిర్మాణ పనులు కూడా చేపడుతున్నారు. వీటి పనులను డీఈ వేణుగోపాల్‌రావు పర్యవేక్షిస్తున్నారు.

మూడు నెలల పాటు పారిశుధ్యంపై దృష్టి: ఎంపీపీ

సత్తుపల్లిరూరల్, జులై24: వచ్చే మూడు నెలల పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుందని ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు అన్నారు. బుధవారం సత్తుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలకు వెళ్దామని, అప్పటి వరకు రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరం సహకరించుకుంటూ కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాసరి చిట్టినాయన, తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, ఎంపీడీవో ఆర్‌సీహెచ్.నాగేశ్వరరావు, ఎంపీఓ కృష్ణలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లాడ బస్టాండ్‌లో మరమ్మతులు

తల్లాడ, జూలై 24: తల్లాడ బస్టాండ్ ఆవరణంలో భారీ వర్షాల వల్ల ఏర్పడిన గుంతలకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. సైడ్‌డ్రైయినేజీ లేకపోవడంతో భారీ వర్షాల వరద ఉధృతికి సిమెంట్ రోడ్డు కొట్టుకుపోయి గుంతలేర్పడ్డాయి. ఈ గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారింది. ఈ దశలో బస్టాండ్‌లోకి వచ్చేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్టీసీ ఖమ్మం రీజియన్ ఇంజనీరింగ్ సెక్షన్ ఆఫీసర్ షేక్. రహీం ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో గుంతలను కంకరు, మట్టితో నింపి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. త్వరలో గుంతలను పూర్తిగా పూడ్చి కొత్తగా సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు రహీం వివరించారు. బస్టాండ్ ప్రాంగణంలోకి వరదనీరు రాకుండా జేసీబీ సాయంతో తాత్కాలికంగా కాల్వను నిర్మించారు.

నిండు కుండలా సంగారెడ్డి చెరువు

కల్లూరు, జూలై 24: కల్లూరు మండలంలోని లక్ష్మీపురం పంచాయితీ పరిధిలో గల సంగారెడ్డి చెరువు ఎన్నో ఏళ్లకు నిండుకుండాల మారింది. ఈ చెరువు 15 సంత్సరాలుగా అలుగు తెగి నీరు నిల్వ ఉండని పరిస్థితి. ఇటీవల కాలంలో చెరువు అలుగును స్వచ్ఛందంగా ఆయకట్టు రైతులు అలుగును పటిష్ట పరిచారు. దీంతో ఇటీవల ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాలతో సదరు చెరువు నిండుకుండలా మారి అలుగు పారింది. దీని పరిధిలో సుమారు 654 ఎకరాలు సాగుబడి కానున్నది. చెరువు నీటి సామర్థ్యం 10 అడుగులకు చేరటంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు.

నిధుల కుదింపుపై రైతుసంఘం నిరసన

వైరా, జూలై 24: కేంద్ర బడ్జెట్లో యూరియా సబ్సిడీ పసల్ బీమాకు నిధులు కుదించి రైతులపై భారం మోపటాన్ని నిరసిస్తూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం వైరాలో ధర్నా నిర్వహించారు. విద్యారంగానికి రూ.తొమ్మిదివేల కోట్ల నిధుల కోతపై నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయం, విద్యారంగాలకు కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, గుమ్మా నర్సింహారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, రుద్రాక్షల నర్సింహాచారి, బాజోజు రమణ పాల్గొన్నారు.

గిరిజనజాతి సంక్షేమమే సేవాలాల్ సేన లక్ష్యం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై 24: గిరిజన జాతి సంక్షేమం, సాంప్రదాయాలను కాపాడడమే సేవాలాల్ సేన అంతిమ లక్ష్యమని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ అన్నారు. సోమవారం నగరంలోని టీటీడీసీలో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క గిరిజన బిడ్డ సేవాలాల్ మహారాజ్ ఆశయసాధనకోసం పని చేయాలన్నారు. మన తండాలో మన రాజ్యం రావాలంటే సేవాలాల్ బాటలోపయనించాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో హాస్సేన్‌నాయక్, వెంకన్ననాయక్, బాలకృష్ణనాయక్, శివనాయక్ , పృధ్వీనాయక్, పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తతతో వ్యవహరించాలి

» ఆర్టీసీలో ప్రమాద రహిత వారోత్సవాలు


మొక్క నాటుతున్న ఎంవీఐ యోగేశ్వర్‌జాదవ్

సత్తుపల్లి, జులై24: ప్రమాదాలు జరిగే సమయంలో డ్రైవర్లు అప్రమత్తతో వ్యవహరించి ప్రాణనష్టం జరగకుండా చూడవచ్చునని ఎంవీఐ యోగేశ్వర్‌జాదవ్ అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో ఆవరణలో మొక్క నాటి ప్రమాద రహిత వారోత్సవాలను ప్రారంభించారు. డిపో ఉద్యోగులను నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగిస్తూ స్వీయ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తోనే మరింత ప్రమాదాలు రోడ్డుపై చోటు చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రమాదాల నివారణ ప్రతిజ్ఞ కృరూ బాద్యతగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో డీఎం యూ.రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఖమ్మం ఖానాపురంహవేలి: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రమాద రహిత వారోత్సవాలను బుధవారం ఖమ్మం నగరంలోని ఆర్టీసీ డిపోలో ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐ శ్రీనివాసరావు హజరై కార్యక్రమాన్ని ప్రారంబించి మాట్లాడారు. డ్రైవర్లకు రోడ్ భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వారోత్సవాల్లో పాల్గొని ప్రమాదాలు నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దానేష్‌కుమార్, వెల్ఫేర్‌బోర్డు మెంబర్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిని తరలిస్తే ఉద్యమమే


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కరుణాకర్

తిరుమలాయపాలెం, జూలై 24: తిరుమలాయపాలేనికి మంజూరైన వంద పడకల ఆసుపత్రిని కూసుమంచికి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దీనిని విరమించుకోవాలని తరలిస్తే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాలుచేపడతామని టీడీపీ జిల్లానాయకుల కొండబాల కరుణాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆసుపత్రి తరలించవద్దంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలేదీక్షలను బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసిందని, దీనికి అనుగుణంగా వైద్యసిబ్బందిని కూడా నియమించగా ఇక్కడ ప్రజలకు వైద్యసేవలందుతున్నాయన్నారు. ఇక్కడి ఆసుపత్రిని మరో ప్రాంతానికి తరలించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, సతీష్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మద్దినేని శ్రీను, పుష్పావతి, రాము, లలిత, శంకర్ పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రానికి వివక్ష: మాస్‌లైన్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 24: తెలంగాణ రాష్ట్ర ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి తన వివక్ష వైఖరీని చూపిందని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలను గుర్తించలేదని, బీజేపీ ప్రభుత్వ తీరు దుర్మార్గంగా ఉందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం కొత్తబస్టాండ్ నుంచి బైపాస్ రోడ్డులో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ పరిశ్రమల నుంచి ప్రాజెక్టుల వరకు అన్ని రంగాల్లోను తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు 8 ఎంపీ సీట్లు బీజేపీకి కట్టబెట్టిన కనీస విశ్వాసం చూపలేదని ఏద్దేవాచేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, నాయకులు సీహెచ్ శిరోమణి, ఝాన్సీ, మంగతాయి, ఆజాద్, సురేశ్, రాకేష్, లలిత, మమత, సంధ్య, సర్దార్ రాకేష్ పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

వైరా: రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం వైరా పాత బస్టాండ్ సెంటర్లో జాతీయ ప్రధాన రహదారిపై ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం రాష్ట్ర నాయకుడు కోలేటి నాగేశ్వరరావు, కె.అర్జున్‌రావు, మందా సురేష్, మక్కా రవీందర్, కె.వెంకటేశ్వర్లు, గ్రేషమ్మ, గండికోట లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రమ దోపిడీ విముక్తి కోసం కార్మికులు ఐక్యం కావాలి: వ్యకాసం


మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఖమ్మం రూరల్, జూలై 24: దోపిడీ విముక్తి కోసం కార్మికులు ఐక్యం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, రాష్ట్ర కమిటి సభ్యుడు పొన్నం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిదిలోని కాచిరాజుగూడెం గ్రామంలో వ్యకాస పాలేరు నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులను సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం ప్రారంబించారు. శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడుతు శ్రమ దోపిడి విముక్తికై కార్మికులంతా ఐక్యంగా పోరాడి, కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయాలన్నారు. ఉపాధి హమీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను వివరించారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి ఈ దేశ భవిష్యత్తును నిర్మించేందుకు పోరాటాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్, వ్యకాసం కార్యదర్శి వి.నాగేశ్వరరావు, యర్రా శ్రీనివాస్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణ, పెద్ద వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌లో 10జీపీఏ సాధించిన విద్యార్థిని

సత్తుపల్లిరూరల్, జూలై 24: పట్టణంలోని వీవీ.విద్యాలయం విద్యార్థిని కంకటి మనోజ్ఞ రీవెరిఫికేషన్‌లో 10/10జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ గోరింట్ల వంశీకృష్ణ బుధవారం తెలిపారు. మొదట ప్రకటించిన ఫలితాలలో సోషల్ సబ్జెక్టులో 9పాయింట్లు సాధించగా ఈఏడాది 10/10సాధించిన వారి సంఖ్య 16కు పెరిగిందన్నారు. మనోజ్ఞను కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్ రెడ్డి, ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

చిన్నారి చికిత్సకు రూ.1.20లక్షలు అందజేత

సత్తుపల్లిరూరల్, జులై24: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి సత్తుపల్లికి చెందిన 'యువభారత్ శక్తి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.20లక్షల ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. కల్లూరుకు చెందిన ఆది నరసింహారావు నాలుగేళ్ల కుమార్తె గుణ తన్విక కవసాకేతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తాము సేకరించిన నగదును ఆమె తండ్రికి అందజేసినట్లు నిర్వాహకులు కామెర క్రాంతి తెలిపారు. ఆపదలో తమను ఆదుకున్న ఫౌండేషన్ బాధ్యులు, దాతలకు గుణతన్విక కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి: ఏవో

వైరా, జూలై 24: అర్హులైన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని గొల్లపూడి గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు 395మంది రైతులు పొందారని తెలిపారు. వివరాలను రైతువేదికల్లో 28లోగా ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

ఖమ్మం రూరల్: ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాదికారి నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మండల పరిదిలోని వ్యవసాయాదికారి కార్యాలయంలో బుదవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రైతు బీమాకు వయోపరిమితి 18 నుంచి 59 సంవత్సరాల మధ్యలో ఉండాలన్నారు. కొత్తగా పాస్ పుస్తకం ఉన్న రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మత్స్యశాఖ ఏడీని కలిసిన రహీం

వైరా, జూలై 24: జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటనర్సయ్యను వైరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు షేక్.రహీం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్యశాఖ ఏడీగా వెంకటనర్సయ్య, నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఖమ్మం ఏడీగా పనిచేసిన ఆంజనేయస్వామి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన వెంకటనర్సయ్యను రహీం కలిసి తమ సంఘం పరిధిలోని సమస్యలను విన్నవించారు. వాటిని పరిష్కరించాలని కోరారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం, జూలై 24: మత్యకారుల అబివృద్ధికి ప్రభుత్వం చేపడుతన్న అభివృద్ధి కార్యక్రమాలను వినియోగించుకోవాలని ముదిరాజ్ సంఘం జిల్లానాయకులు ఓర వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రఘునాధపాలెంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మత్స్యశాఖ ఏడీగా బాధ్యతలు చేపట్టిన వెంకటనర్సయ్యకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో బొమ్మకంటి సైదులు, యాదగిరి, మల్లయ్య, పాల్గొన్నారు.

భూ తగాదా విషయంలో ఘర్షణ

● ఇరువర్గాలపై కేసు నమోదు

ఖమ్మం రూరల్ జూలై 24: భూ తగాదా విషయంలో జరిగిన ఘర్షణపై ఇరువర్గాలపై ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళగూడెం గ్రామానికి చెందిన కొప్పుల రామారావు భూమిలోకి అతని సోదరుడు కొప్పుల నాగేశ్వరరావు, సోదరుల కుమారులు కొప్పుల రమేశ్, కొప్పుల నగేశ్, తీర్థాలకు చెందిన ట్రాక్టర్ డైవర్ తేజావత్ రవి బుధవారం అక్రమంగా ప్రవేశించారు. దీంతో రామారావుకు వారికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో రామారావు అతని కుమారుడు జగదీశ్‌లపై దాడిచేసి గాయపరిచారు. ఈ సంఘటనపై రామారావు ఫిర్యాదు మేరకు నాగేశ్వరరావు, రమేశ్, నగేశ్, రవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. కొప్పుల నాగేశ్వరరావు తమ భూమిలో పంట వేసుకోగా ఆ పంటను కొప్పుల రామారావు, జగదీశ్‌లు నాశనంచేసి తమ భూమిలోకి రాకుండా తమను అడ్డుకుంటున్నారని నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు రామారావు జగదీశ్ లపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల కోసం పని చేసేది కమ్యూనిస్టులే: సీపీఐ

కొణిజర్ల, జూలై 24: పేదప్రజల సమస్యల కోసం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ నాయకులు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని తనికెళ్ళ సీపీఐ కార్యాలయంలో జరిగిన తుల్లూరీ తులిశమ్మ వర్ధంతిసభలో వారు పాల్గొని మాట్లాడారు. నిరంతరం పేదప్రజల సమస్యలు కోసం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. ప్రభుత్వాలు ప్రజాసమస్యలను విస్మరిస్తే పోరాటాలు తప్పదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యర్రాబాబు, పీవీరావు, ఏసు, కొనపర్తి విష్ణుమూర్తి, గడల రామారావు, పసుమర్తి శంకర్‌రావు, తుల్లూరు మురళి, యాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


మధిరలో కేక్ కట్‌చేస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల

మధిరటౌన్,జులై24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను బుధవారం మధిర లోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు బీఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్, యూత్ అధ్యక్షులు కూన నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు, శివాలయం మాజీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు నాయకులు ప్యారీ, ఇందిర కౌన్సిలర్లు సయ్యద్ ఇక్బాల్, బిక్కి అనిత, కోఆప్షన్ మెంబర్ రాఘవ పాల్గొన్నారు.

చింతకాని: మండల కేంద్రంలో బుధవారం కేటీఆర్ జన్మదిన వేడుకలు పార్టీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. సంధర్బంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ ఎంపీపీ హనుమంతరావు, బొడ్డు వెంకటరామారావు, వేముల నర్సయ్య, పిన్నెల్లి శ్రీనివాస్, రత్నాకర్, గడ్డం శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ముదిగొండ: బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం ముదిగొండలోని ఆపార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, కార్యదర్శి గడ్డం వెంకట్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, నాయకులు బంకా మల్లయ్య, వెంకట్, ఎర్ర వెంకన్న, పొనుకుల కోటేష్, చెరుకుపల్లి భిక్షం, ధనియాకుల వీరస్వామి, తలారి భిక్షం, మాలోజి గోవిందు, పంది శ్రీను, నాగార్జున, పాపారావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

తల్లాడ, జూలై 24: దగ్గుల కృష్ణవేణి జ్ఞాపకార్థం సేవ కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు అన్నారు. బుధవారం తల్లాడలో కృష్ణవేణి జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు దగ్గుల అప్పిరెడ్డి, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఉచిత వాటర్‌ట్యాంకర్ సేవలను ఎస్ఐ ప్రారంభించారు. ఎస్ఐను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ వల్లాల వెంకటసుబ్బమ్మ, దగ్గుల శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, నర్సిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అమూల్య, కాంతారెడ్డి, నారాయణ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రేగళ్ల పుల్లారెడ్డి, భద్రారెడ్డి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల వితరణ

వైరా, జూలై 24: వైరాలో బుధవారం లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. సీహెచ్.జ్యోతి జన్మదినాన్ని పురస్కరించుకొని బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన మస్తాన్‌బీకి గ్రేట్‌విజన్ క్లబ్ ఆధ్వర్యంలో అలాగే గోగుల రేణుకకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమాల్లో డాక్టర్ కాపా మురళీకృష్ణ, కౌన్సిలర్ మాదినేని సునీత, చింతలపూడి వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్, మరికంటి రామ్‌గోపాల్, చల్లా రాంబాబు, శ్యాంబాబు, పాల్గొన్నారు.

రుణమాఫీ నగదును రైతు ఖాతాలో జమచేయాలి

» డీఏవో విజయనిర్మల » రైతులతో మాటామంతి


రైతుతో మాట్లాడుతున్న డీఏవో విజయనిర్మల

చింతకాని/నేలకొండపల్లి జూలై 24: రుణమాఫీ పొందిన రైతులు డబ్బులను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డీఏవో విజయనిర్మల బ్యాంకు అధికారులను కోరారు. బుధవారం మండల పరిధిలోని జగన్నాథపురం, నాగులవంచ గ్రామాల్లోని రైతు వేదికలో రుణామాఫీ రైతులతో మాట్లాడారు. రైతులకు ఉన్న పలు సందేహాలను నివృత్తి చేశారు. రుణమాఫీ లబ్ధిపొందిన రైతులు కంభం సత్యనారాయణ, కంభం శేషయ్య, బల్లి బంగారయ్య, పరిటాల వెంకట్రామయ్య ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. గ్రామంలోని పీఏసీఎస్ సీఈవో, గ్రామీణ బ్యాంకు మేనేజర్‌తో రుణమాఫీ నగదు లావాదీవీలపై చర్చించారు. లబ్ధిపొందిన రైతుల నగదును వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో పల్లెల నాగయ్య, ఏఈవోలు హరికృష్ణ, నవీన్, బ్యాంకు మేనేజర్ చైతన్య, సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రుణమాఫీపై బ్యాంకర్‌తో వ్యవసాయాధికారుల చర్చలు

నేలకొండపల్లి: రైతుల రుణ మాఫీపై బుధవారం వ్యవసాయాధికారులు నేలకొండపల్లిలో బ్యాంకర్లతో చర్చించారు. నేలకొండపల్లిలోని ఎస్‌బీఐ, చెర్వుమాధారంలోని ఏపీజీవీబి బ్యాంకులకు వెళ్ళి ఎంత మంది రైతులకు రుణ మాఫీ వచ్చింది ఆరా తీసారు. రుణమాఫీపై రైతుల సందేహాను నివృత్తి చేయటానికి బ్యాంకులో ఒక ఉద్యోగిని ఏర్పాటు చేయాలని కోరారు. కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు విజయచంద్ర, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, నేలకొండపల్లి ఏఈఓ దుర్గాభవానిలు బ్యాంకర్లను కలిసిన వారిలో ఉన్నారు.

క్రాప్ వెరిఫికేషన్..

క్రాప్ వెరిఫికేషన్‌లో భాగంగా మండ పరిధిలోని అప్పలనర్సింహాపురంలోని రైతుల పొలాలను వ్యవసాయాధికారులు సందర్శించారు. కార్యక్రమంలో ఏఈఓలు దుర్గాభవాని, శిరీష, అరవింద్‌లు పాల్గొన్నారు.